క్లుప్తంగా

పొన్నూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నేడు

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న పూజా కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని సీతారామ టౌన్‌షిప్ దగ్గరలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. కమిషనర్‌తో పాటు మున్సిపల్, ఆలయ అధికారులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ పర్యటించి ఆక్రమణలకు గురైన డ్రెయిన్లను పరిశీలించారు. డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద బాధితులకు సెయింట్ ఆన్స్ స్కూల్ సహాయం



పొన్నూరు: విజయవాడ సింగ్ నగర్ వరద బాధితులకు పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ చేయూత అందించింది. బాధితుల సహాయార్థం రూ.2.50 వేల విలువ కలిగిన నిత్యావసరాలు, దోమ తెరలు, దుప్పట్లు , టవల్స్, చీరలతో పాటు పలు రకాల వస్తువులు అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో వరద బాధితులను ఆదుకునేందుకు సహాయం అందించడం సంతోషాన్ని కలిగించిందని స్కూల్ ప్రిన్సిపాల్ రీనాఆన్ తెలిపారు. 190 బ్యాగులను పాఠశాల నుంచి శుక్రవారం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



గుంటూరు రూరల్: గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. ఏటుకూరు గ్రామానికి చెందిన ప్రసాదం సీతారావమ్మ(72) స్థానికంగా ఆంజనేస్వామి గుడిలో పూజ ముగించుకుని ఇంటికి బయల్దేరింది. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ధన్‌కు నివాళి

లక్ష్మీపురం: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ శత జయంతి సభ స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించారు. తొలుత బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.రాధాకృష్ణ మూర్తి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంత రావు, నగర గౌరవ అధ్యక్షులు జి. సురేష్ బాబు, నగర కార్యదర్శి అంజిబాబు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి



కోయవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలిస్తున్న సీడీపీఓ

ప్రత్తిపాడు: రక్తహీనత నివారణలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి. సుజాతదేవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కోయవారిపాలెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు చేయించారు. అనంతరం పోషకాహార ఆవశ్యకతపై అంగన్‌వాడీలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో చిరుధాన్యాలు, పోషకాహారాన్ని ప్రదర్శించారు. సీడీపీఓ సుజాతదేవి తల్లులతో పోషణ ప్రతిజ్ఞ చేయించి, మాట్లాడుతూ రక్తహీనతను నివారించేందుకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్, బీ– 12 మాత్రలు వేసుకోవాలన్నారు. సీ విటమిన్ అధికంగా ఉండే జామ, నారింజ, బత్తాయి, ఉసిరి పండ్లు తినాలని సూచించారు. కర్జూరాలు, బాదం పప్పు, కిస్‌మిస్, అంజీరా, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్‌ను తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. అదే విధంగా క్యారెట్, బీట్‌రూట్, ఆకుకూరలు, కోడిగుడ్లు, మునగాకు, వేరుశనగ చిక్కీలు, నువ్వులు, చిరుధాన్యాలు ప్రతిరోజూ ఆహారంలో ఉండేలా తల్లులు చూసుకోవాలన్నారు. ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని వడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ మాసోత్సవంలో సూపర్‌వైజర్ ఎస్.భారతి పాల్గొని అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.లక్ష్మీతిరుపతమ్మ, ఏఎన్‌ఎం జి. శ్యామల పాల్గొన్నారు.

వీవీఐటీలో ఐక్యా 2కే24



ఐక్యా 2కె24 కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఐక్యా 2కె24 సాంకేతిక సదస్సును విద్యార్థి విభాగం చైర్మన్ డాక్టర్ బి.సూర్యప్రసాద్ ప్రారంభించారు. మండల పరిధిలోని నంబూరు వీవీఐటీలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో 30 కళాశాలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలలో డైవ్ ఇన్ థాట్స్, బ్రేకింగ్ కోడ్స్, మిస్టరీ లూట్, క్రియేటివ్ క్లాష్ వంటి 15 సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐఈటీఈ చైర్మన్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఆధునిక సాంకేతికతను 6జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికత సరైన మార్గంలో మానవాళి అవసరాలకు అనుగుణంగా వినియెగించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఇటువంటి సాంకేతిక సదస్సుల వలన విద్యార్థులు సాంకేతిక మార్పులను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.భానుమూర్తి, ఐఈటీఈ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఎన్‌సీసీ విద్యార్థులకు బీ సర్టిఫికెట్ల ప్రదానం



ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లు పొందిన క్యాడెట్స్‌తో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రమశిక్షణకు, సేవా నిరతికి, దేశభక్తికి రూపం ఎన్‌సీసీ అని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో సర్టిఫికెట్ల ప్రదానం శుక్రవారం నిర్వహించారు. సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్‌సీసీ బాలుర విభాగ సర్టిఫికెట్ బీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతలై 16 మంది మంచి ఫలితాలు సాధించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ బాలుర విభాగం ఆఫీసర్ లెఫ్టినెంట్ తారాచంద్, హవాల్దార్ బసవరాజ్, హవాల్దార్ మణికంఠన్ పాల్గొన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ విజయ్ భాస్కర్, హెచ్‌ఎం సత్యం

కాకుమాను: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నేటి విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ విజయ్ భాస్కర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రం తయారీపై మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు జనరల్ నాలెడ్జ్ వంటిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం పాల్గొన్నారు.

వరద బాధితులందరికీ పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: వరద ప్రభావంతో ఇళ్లు దెబ్బతిన్న బాధితులందరికీ నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. వరద బాధితులందరికీ నష్టపరిహారం అందజేయాలని శుక్రవారం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఈమధ్య కాలంలో కురిసిన అధిక వర్షాలు, తుఫాన్ ప్రభావంతో ఒక్కసారిగా వరద నీరు సుందరయ్య కాలనీలోకి రావడం వలన కట్టుబట్టలతో ఇల్లు వదిలి అధికారుల సూచనల మేరకు పునరావస కేంద్రాలకు వెళ్లారని, ఆ సమయంలో రెవెన్యూ అధికారులు భోజనం, మంచినీరు, ఇతర వసతులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నీరు తగ్గిన తర్వాత ఇళ్లలో చేరిన బురద క్లీన్ చేసుకుని నెమ్మదిగా ఒక్కొక్కరు ఇళ్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రతి ఒక్కరిని ఆదుకుంటాం అని హామీ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం వరద బాధితులకు పరిహారం రిలీజ్ చేస్తున్నాం అని ప్రకటించిన తరువాత కొంతమందికి పదివేల రూపాయలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయన్నారు. ఇంకా కొంతమందికి జమ కానందున ఆందోళన చెందుతున్నారన్నారు. మిగిలిన వారికి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.బాబూరావు, బురదగుంట సాంబయ్య, సుందరయ్య కాలనీ వాసులు షేక్ మీరావలి, జెట్టి రాజలక్ష్మి, షేక్ మరింబి, షేక్ గౌసియా, ఎ.నాగేశ్వరావు, చెన్నం రామకృష్ణారావు పాల్గొన్నారు.

క్లీన్ గుంటూరుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం



డ్రెయిన్ పరిశీలిస్తున్న పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల కారణంగా జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాల్లో ముంపు నివారణకు శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి– కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చుట్టగుంట, ఏటీఅగ్రహారం, కేవీపీ కాలనీ, జోసఫ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగరపాలకసంస్థ అధికారులతో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువల వ్యవస్థను పరిశీలించారు. చుట్టుగుంట రైతు బజార్ సమీపంలోని సజావుగా సాగని డ్రెయిన్లను పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైడ్ కాలువలు విస్తరించని కారణంగా మురుగు పొంగి రోడ్ల మీదకు చేరుతోందని ఏటీ అగ్రహారంలో స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జోసఫ్ నగర్‌లో సైడ్ కాలువల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చంద్రభానుడిగుంట చెరువు ఇటీవల పొంగి నీటి మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ సమీపంలోని నాలుగు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు విన్నవించారు. సమస్యకు పరిష్కారం దిశగా సీఎస్ఆర్ ఫండ్ లేదా అమృత్ పథకం కింద చేర్చి త్వరగా ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జోసఫ్ నగర్, లక్ష్మీనగర్, నల్లపాడు రోడ్డు వద్ద జరిగిన పరిశీలనలో భాగంగా కార్పొరేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్, వెంకటకృష్ణ, ఎస్ఈ శ్యామ్ సుందర్, టౌన్ ప్లానర్ రాంబాబు, టీపీఎస్ లక్ష్మణస్వామి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల వార్షికోత్సవం

నగరంపాలెం: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల 52వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై వేడుకలు జరుగుతాయని చెప్పారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

ఎక్సైజ్ గుంటూరు డిపో మేనేజర్ శ్రీలత బాధ్యతలు స్వీకారం



నెహ్రూ నగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు డిపో మేనేజర్‌గా శ్రీలత నల్లపాడు లోని డిపోలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ శాఖ అధికారుల బదిలీల్లో రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న శ్రీలతను గుంటూరు డిపోకు బదిలీ చేశారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని ఏలూరు డిపోకు బదిలీ చేశారు. అదేవిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్(అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్)గా సూర్యనారాయణ, గుంటూరు ఈఎస్ టాస్క్ ఫోర్స్ ఏఈఎస్‌గా మారయ్య బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నెహ్రూ నగర్: గోరంట్ల అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ(ప్రాజెక్ట్ డైరెక్టర్) ఉమాదేవి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. లబ్ధిదారులకు కందిపప్పు ఇంకా పంపిణీ చేయకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని లేకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు..



నగరంపాలెం: మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ పాఠశాల, హిందూ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు.
డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయలుదేరే ప్రతి ఒక్కరూ నెమ్మదిగా వాహనాలు నడపాలని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వెళ్లిన ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, కుటుంబ సభ్యులకు, స్థానికులకు తెలియజేయాలని తెలిపారు. అతి వేగంతో వాహనాలు నడిపితే దుష్పరిణామాలను వారికి వివరించాలని అన్నారు. కార్యక్రమం లో సీఐలు సింగయ్య(పశ్చిమ ట్రాఫిక్), అశోక్(తూర్పు ట్రాఫిక్) పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వృద్ధురాలి మృతి

పట్నంబజారు: అనారోగ్యంతో రోడ్డుపై వృద్ధురాలు పడి మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ హైస్కూల్ సమీపంలో నివాసం ఉండే మార్నెళ్ల రేవతి(52) ఆమె నివాసం ఉండే ఎదురుగానే శుక్రవారం ఉదయం కిందపడి మృతిచెందింది. ఇంటి యజమాని మొహమ్మద్ చిద్రీస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8688831069 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- విరుత్స సాఫ్ట్‌వేర్ సంస్థ నేషనల్ హెడ్ అభిషేక్
- కళ్లం కళాశాలలో సంకల్ప్ వేడుకలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్య సాధన దిశగా క్రమశిక్షణతో సాంకేతిక నైపుణ్యాలను మెరుగులు దిద్దుకుంటూ ముందుకు సాగాలని, కష్టపడితే లక్ష్య సాధన సులభమని విరుత్స సాఫ్ట్‌వేర్ సంస్థ నేషనల్ హెడ్ జి.అభిషేక్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సంకల్ప్– 2024 వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యపై అన్నివిధాలుగా పట్టు సాధించనపుడే అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, హ్యాకథాన్, కోడింగ్ టెస్ట్, ట్రెజరర్‌హంట్, మార్కెట్ మేకర్స్, బిజినెస్ క్విజ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. టెక్నికల్ క్విజ్‌లతోపాటు క్రీడా విభాగాలలో చెస్, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, త్రోబాల్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడలు, వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ జి.కిషోర్‌బాబు, హనుమంత ప్రసాద్, డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రామారావుకు జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు



ఏపీటీఐ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉత్కల్ యూనివర్సిటీ వేదికగా అవార్డు ప్రదానం చేశారు. శుక్రవారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఫార్మసీ రంగానికి సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచి అధ్యాపకులను ప్రశంసిస్తూ ఎంతోమంది నూతన ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా మారిందన్నారు. ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు చలపతి ఫార్మసీ కళాశాల స్థాపించిన నాటినుంచి ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తూ ఫార్మసీ విద్యా, పరిశోధనా రంగంలో 33 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి 500కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారని, 14 పుస్తకాలను రచించి 4 పేటెంట్లను సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు.

కిట్స్‌లో ఈ-క్వెస్ట్ వర్క్‌షాప్



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కె.కె.ఆర్. అండ్ కె.ఎస్.ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాలలో రెండు రోజులుగా ఈ–సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈక్వెస్ట్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులు వ్యాపార ఆలోచనలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో, వ్యాపార ప్రణాళికలను ఎలా రూపొందించాలి అన్న అంశంపై రెండు దశల్లో వర్క్‌షాప్ నిర్వహించారు. మొదటి దశలో డీల్ డ్యాష్, విజన్ డ్రాఫ్ట్, క్విజ్ విజ్ అనే మూడు అంశాలపై పోటీలు నిర్వహించగా ఆరు టీంలు రెండో దశకు చేరాయి.
సెకండ్ ఫేజ్‌లో పిచ్ ప్రాప్ అంశంపై జరిగిన పోటీల్లో పాల్గొన్న టీం సభ్యులు తమ వ్యాపార ఐడియాలు, బిజినెస్ నమూనాలను ఎంబీఏ ఫ్యాకల్టీ ముందు ప్రదర్శించారు. హెచ్‌ఓడీలు పిచ్, వ్యాపార మోడల్స్‌ను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. వారికి నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడం, వ్యాపార ఆలోచనలను పెంపొందించడం వర్క్‌షాప్ ఉద్దేశమని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, ఈ–సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం.పూర్ణకిషోర్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు



పెదకాకాని ఉర్దూ స్కూల్‌లో ఎంఈఓ బలిరాంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెదకాకాని: అంకితభావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా గుర్తించబడతారని మండల విద్యాశాఖాధికారి శంకరరాజు అన్నారు. పెదకాకాని మండల ఎంఈఓ ధరావత్ బలిరాం ఈనెల 29న ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా పెదకాకాని పాతూరు ఉర్దూ స్కూల్‌లో శుక్రవారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఎంఈఓ శంకరరాజు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకున్నపుడు మొట్టమొదట గర్వపడేది ఉపాధ్యాయుడేనన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఎంఈఓ బలిరాంను చూసి నేర్చుకోవాలన్నారు. సన్మాన గ్రహీత ఎంఈఓ డి.బలిరాం మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ వృత్తి ధర్మానికి న్యాయం చేయాలన్నారు. బలిరాంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఎండీ షహబానా, కాళిదాస్, పి.రామకృష్ణ, సుబ్బారెడ్డి, కుటుంబరావు, బాజిబాబు పాల్గొన్నారు.

కామెర్ల వ్యాధికి ఆపరేషన్‌తో చెక్

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్



రోగి లెనిన్‌బాబుతో డాక్టర్ అందె కోటివెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ఏడాదిగా కామెర్ల వ్యాధితోతో బాధపడుతూ పలు ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాని రోగికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జికల్ విభాగం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి చెందిన లెనిన్‌బాబు ఏడాదిగా జాండీస్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో గత ఏడాది సెప్టెంబరులో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాధిపతి డాక్టర్ కవిత, పలు రకాల పరీక్షలు చేసి అక్టోబరులో స్టంట్ వేశారు. కొంత మేర ఉపశమనం లభించి కామెర్లు తగ్గుముఖం పట్టాయి. 2024 మార్చిలో తీవ్ర జ్వరం రావడంతో జీజీహెచ్‌కు వచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు ఏప్రిల్ 10న రెండోసారి స్టంట్ వేశారు. మూడు నెలలపాటు ఆరోగ్యంగా ఉన్న లెనిన్‌బాబు మరలా తీవ్ర జ్వరం రావడంతో గతనెల జీజీహెచ్‌కు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటివెంకటేశ్వర్లు పరీక్షలు చేసి కడుపులో గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. పేగులు దెబ్బతిని ఉండటం గమనించారు. ఆపరేషన్ చేయాలని, రిస్క్‌తో కూడుకుందని కుటుంబ సభ్యులకు వివరించారు. 20 రోజుల క్రితం ఆపరేషన్ చేసి దెబ్బతిన్న పేగు తీసివేసి, దాని స్థానంలో కొత్తపేగును అమర్చారు. కణితులను డయాలసిస్ ల్యాబ్‌కు పంపగా, క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, క్యాన్సర్ చికిత్సకు రిఫర్ చేశారు. సుమారు ఆరు గంటలసేపు చేసిన ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ కోటి వెంకటేశ్వర్లుతోపాటు, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ వంశీ, ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ శాంసన్, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప్తి పాల్గొన్నట్లు డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సుమారు రూ.10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేశామన్నారు. ఎంతో కష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేసి లెనిన్‌బాబు ప్రాణాలు కాపాడిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య బృందాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.